రేషన్.. పరేషాన్

- ఐదు నెలలుగా లబ్ధిదారులకు నో రేషన్
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కొత్తబురుజు డీలర్
- చర్యలు తీసుకోవాలని కోరుతున్న స్థానికులు

డోన్ రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి డోన్ మండలంలోని పలు రేషన్ డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అరకొరగా సరఫరా చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. గత ప్రభుత్వంలో లబ్ధిదారులు ఇంటి వద్దనే రేషన్ తీసుకునేవారు. అయితే ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. కార్డుదారులకు రేషన్ కష్టాలు మొదలయ్యాయి. ప్రతి నెలా రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి గంటల తరబడి క్యూలో నిల్చొని రేషన్ తీసుకోవాల్సిన పరిస్థితి. కొందరు డీలర్లు అయిన కాడికి సరఫరా చేసి దుకాణం కట్టేస్తున్నారు. మరికొందరు ఏవో సాకులు చూపుతూ తిప్పుకుంటున్నారు. ఇందుకు చక్కటి ఉదాహరణే మండలంలోని కొత్తబురుజు రేషన్‌దుకాణం.

కొందరికే రేషన్

మండల పరిధిలోని కొత్తబురుజు గ్రామంలో ఐదు నెలలుగా రేషన్ బియ్యం వేయడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో కొంత మందికి మాత్రమే వేసి మిగిలిన వారికి లేవు అని చెప్పి పంపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే మీ ఇష్టం వచ్చిన చోట చెప్పుకోండని డీలర్ శోభక్క భర్త గోవింద్ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని వాపోతున్నారు. పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి డీలర్‌పై వెంటనే చర్యలు తీసుకుని సక్రమంగా రేషన్ అందేలా చూడాలని కోరుతున్నారు.



రేషన్ బియ్యం వేయకపోవడంతో తిరుగుముఖం పట్టిన గ్రామస్తులు

ఐదు నెలలుగా బియ్యం వేయడం లేదు



టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలలుగా రేషన్ బియ్యం వేయడం లేదు. ప్రతి నెలా మొదటి వారం పనులు మానుకుని రేషన్ దుకాణానికి రావడం.. లేదని సమాధానం ఇవ్వడం పరిపాటిగా మారింది. ప్రతి నెలా ఇలానే చేయడం దారుణం. డీలర్‌పై చర్యలు తీసుకోవాలి. –అశోక్, కొత్తబురుజు గ్రామం

కొంత మందికి మాత్రమే వేస్తున్నారు



గ్రామంలో కొంత మందికి మాత్రమే రేషన్ బియ్యం వేస్తున్నారు. మిగిలిన వారు అడిగితే లేవు అయిపోయాయి అని సమాధానం చెబుతున్నారు. రేషన్ బియ్యం లేకపోవడంతో అధిక మొత్తం వెచ్చించి బయట మార్కెట్‌లో బియ్యం కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. మాకు రేషన్ బియ్యం అందేలా అధికారులు చూడాలి. –ప్రతాప్‌నాయుడు, కొత్తబురుజు

చర్యలు తీసుకుంటాం



గ్రామంలో రేషన్ సక్రమంగా అందడం లేదని ఫిర్యాదులు అందాయి. గ్రామానికి వెళ్లి విచారణ చేయిస్తాం. నిజమేనని తెలిస్తే చర్యలు తీసుకుంటాం. ప్రతి నెలా డీలర్లు లబ్ధిదారులకు సక్రమంగా రేషన్ సరఫరా చేయాలి. లేకుంటే చర్యలు తప్పవు. –నాగమణి, తహసీల్దార్, డోన్

క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

కోవెలకుంట్ల: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎంపీడీఓ వరప్రసాదరావు అన్నారు. స్వచ్ఛ కోవెలకుంట్ల–మన కోవెలకుంట్ల కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని బీవీ సుబ్బారెడ్డి పార్కులో గ్రామ పంచాయతీ, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, గ్రామ సచివాలయ ఉద్యోగులు శ్రమదానం చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి గాంధీసెంటర్ వరకు ప్లకార్డులతో స్వచ్ఛతపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ.. అపరిశుభ్రత కారణంగా దోమలు వ్యాప్తి చెంది మలేరియా, చికున్‌గున్యా, డెంగీ, తదితర ప్రాణాంతక జ్వరాలు సోకే అస్కారం ఉందన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే దోమలు వ్యాప్తి చెందవన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ప్రకాష్‌నాయుడు, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

కలెక్టర్ వ్యాఖ్యలు బాధాకరం



ఎంపీడీఓ సాల్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

సంజామల: నంద్యాల కలెక్టర్ రాజకుమారి ఈనెల 14వ తేదీ జరిపిన టెలీకాన్ఫరెన్స్‌లో పంచాయతీ కార్యదర్శులపై చేసిన వ్యాఖ్యలు బాధాకరమని మండలంలోని పంచాయతీ కార్యదర్శులు అన్నారు. ఆమె వ్యాఖ్యలకు నిరసనగా శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సాల్మన్‌కు వినతి పత్రం అందజేశారు. ముదిగేడు పంచాయతీ కార్యదర్శి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. తాము సచివాలయ సిబ్బందిపై పెత్తనం చేయడంలేదని, ప్రభుత్వం అప్పగించిన సర్వే పనులను పూర్తి చేయడంలో వారిపై ఒత్తిడి తేవడం తప్ప మరో ఉద్దేశం లేదని తెలిపారు. ఈఓఆర్డీ రాధిక, ఏఓ విజయకుమార్ రెడ్డి, పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు

బనగానపల్లె: విద్యార్థులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని టంగుటూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు అన్నారు. శనివారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. జ్వరం, దగ్గు, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం మొదలైన సమస్యలు ఉంటే స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ శేఖర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహనతోనే హెచ్ఐవీ నిర్మూలన



సీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ

బేతంచెర్ల: ప్రజలకు హెచ్ఐవీపై అవగాహన కల్పించడం ద్వారా వ్యాధి నిర్మూలన సాధ్యం అవుతుందని అడిషనల్ డీఎంహెచ్‌ఓ శారదబాయి అన్నారు. శనివారం పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీని సందర్శించారు. ఆస్పత్రి రికార్డులు, హెచ్ఐవీ, టీబీ వ్యాధిగ్రస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారికి అందుతున్న వైద్య సేవలపై వైద్యురాలు స్వప్నవాణితో చర్చించారు.

విద్యార్థులకు ఉపన్యాస పోటీలు



విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించినట్లు లైబ్రేరియన్ బాలతిమ్మారెడ్డి తెలిపారు. గ్రంథాలయ పితామహుడు గాడిచెర్ల హరిసర్వోత్తమరావు జీవిత చరిత్రపై విద్యార్థులకు ఉపన్యాయ పోటీలు నిర్వహించి ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశామన్నారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు సుధీర్, గిద్దలూరు గ్రామ గ్రంథాలయ నిర్వాహకుడు మద్దిలేటి పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగంపై అవగాహన

డోన్ టౌన్: స్థానిక పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో వంట గ్యాస్ వినియోగంపై విద్యార్థినులకు శనివారం అవగాహన కల్పించినట్లు హెచ్‌ఎం పద్మావతి తెలిపారు. గ్యాస్ సిలిండర్ ఇంటికి వచ్చినప్పుడు లీకేజీ ఉందా అని చెక్ చేసుకోవాలన్నారు. అనుమానం ఉంటే వెంటనే సంబంధిత డీలర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. గ్యాస్ సిలిండర్ ఎల్లప్పుడు స్టవ్ కంటే కింద ఉండాలని, సిలిండర్ మార్చే సమయంలో విద్యుత్ స్విచ్‌లు, అగ్గి పెట్టె వెలిగించడం వంటివి చేయరాదని సూచించారు. సురక్షితమైన రబ్బరు ట్యూబ్‌ను వినియోగించాలన్నారు. ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, వెంకటలక్ష్మి, రాధ, లక్ష్మీ ప్రభావతి, హుస్సేన్‌భాను, గ్యాస్ డీలర్లు పాల్గొన్నారు.

19 నుంచి ఆధార్ క్యాంపులు

బేతంచెర్ల: పట్టణంలోని ప్రాథమిక పాఠశాలలో ఈ నెల 19, 20వ తేదీలు, గోరుమానుకొండ మోడల్ స్కూల్‌లో 21, 22వ తేదీల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని ఎంఈఓ సోమశేఖర్ తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల హెచ్‌ఎంలు ఆధార్ సేవలపై విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆధార్‌లో మార్పులు, చేర్పులకు అవకాశం ఉంటుందని.. సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

దెబ్బతిన్న వరి పంట పరిశీలన



బిజనవేములలో నేలవాలిన వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

కోవెలకుంట్ల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజులపాటు కురిసిన మోస్తరు వర్షాలకు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి నేలవాలింది. శనివారం కోవెలకుంట్ల వ్యవసాయ సహాయ సంచాలకులు సుధాకర్, మండల వ్యవసాయాధికారి నిరంజన్ మండలంలోని బిజనవేముల, వెలగటూరులో దెబ్బతిన్న వరి పైర్లను పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ.. తుపాన్ కారణంగా కురిసిన వర్షాలకు వరి నేలవాలిందని, ప్రస్తుతం వర్షం తగ్గుముఖం పట్టిందన్నారు. రైతులు నేలవాలిన వరి పంటను వీలైనంత త్వరగా కట్టలుగా కట్టుకుని పంటను కాపాడుకోవాలని సూచించారు. మండలంలోని ఆయా గ్రామాల పరిధిలో సుమారు 500 ఎకరాల్లో వరి పంట నేలవాలి దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేశామన్నారు. వర్షం కారణంగా జరిగిన నష్టానికి సంబంధించిన నివేదికలను జిల్లా అధికారులకు అందజేశామని పేర్కొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

కొలిమిగుండ్ల: గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీల అభివృద్ధిపై 2025–26 ఆర్థిక సంవత్సరానికి యాక్షన్ ప్లాన్ తయారీపై శిక్షణ ఇచ్చారు. పంచాయతీ నిధులతో వచ్చే ఆర్థిక సంవత్సరానికి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించాలని తెలిపారు. పారిశుద్ధ్యం, తాగునీరు తదితర అంశాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో చేపట్టాల్సిన పనులు, నిధులు వినియోగం తదితర వాటిపై అవగాహన కల్పించారు.

వెలుగు ఏపీఎంను సస్పెండ్ చేయాలి



వెంకట్రామిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వీఓఏలు

డోన్ టౌన్: అధికార పార్టీకి తొత్తులుగా మారి వేధింపులకు గురిచేసి కొత్తబురుజు బుక్ కీపర్ (వీఓఏ) వెంకట్రామిరెడ్డి మృతికి కారణమైన డోన్ వెలుగు ఏపీఎం మల్లికార్జున, సీసీ ఈశ్వరమ్మను సస్పెండ్ చేసి మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షుడు సోమన్న, కోశాధికారి వెంకటరమణ డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి కొత్తబురుజు గ్రామానికి వెళ్లి బాధిత కుటంబ సభ్యులను పరామర్శించారు. అధికార పార్టీ నాయకుల ఆదేశాలకు తలొగ్గి ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న వారిని అక్రమంగా తొలగిస్తూ వారి కుటుంబ సభ్యులను రోడ్డున పడేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా తొలగించిన వీఓఏలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, లేకుంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి శివరామ్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

బాధ్యులపై కేసు నమోదు చేయాలి

డోన్ రూరల్: కొత్తబురుజు వీఓఏ వెంకట్రామిరెడ్డి మృతికి కారణమైన ఏపీఎం మల్లికార్జున, సీసీ ఈశ్వరమ్మలపై కేసు నమోదు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ నాయకులకు తొత్తులుగా మారి పొదుపు ఏపీఎం, సీసీల వేధింపులు తారా స్థాయికి చేరాయన్నారు. రాజీనామా చేయాలని నిత్యం వేధింపులకు గురి చేయడంతోనే వెంకట్రామిరెడ్డి మృతి చెందాడన్నారు. మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని, మృతుని కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు పి.సుంకయ్య, రాధాకృష్ణ, నారాయణ, మోటారాముడు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



ఆర్‌బీఎస్‌కే కార్డులతో విద్యార్థులు

కోవెలకుంట్ల: విద్యార్థులు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని రేవనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ విద్యాసాగర్ సూచించారు. శనివారం మండలంలోని రేవనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రీయ బాల స్వస్థకార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు బరువు, ఎత్తు, రక్తహీనత, కంటి సమస్యలు, తదితర ఆరోగ్య సమస్యలపై ప్రాథమిక పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. ప్రతి గురు, శనివారాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. విద్యార్థులకు ప్రాథమిక పరీక్షలు నిర్వహించి ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే పీహెచ్‌సీ ద్వారా వైద్యం అందిస్తామన్నారు. మెరుగైన వైద్యం కోసం అవసరమైతే జిల్లాస్థాయి ఆస్పత్రికి రెఫర్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుందరయ్య, హెల్త్ సూపర్‌వైజర్లు ప్రభావతి, గిరిజ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పేదలకు 3 సెంట్ల స్థలం కేటాయించాలి



గిద్దలూరులో అర్జీలను స్వీకరిస్తున్న సీపీఐ నాయకులు

సంజామల: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ రైతు విభాగం మండల కన్వీనర్ అబ్రహం అన్నారు. మండల పరిధిలోని గిద్దలూరు సీమలతిప్ప కాలనీలో ఇళ్లు లేని నిరుపేదల నుంచి శనివారం అర్జీలను స్వీకరించారు. గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు.

విద్యతో పాటు క్రీడలూ ముఖ్యం



డీఎస్పీని సత్కరిస్తున్న పీఈటీలు

డోన్ టౌన్: విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా నేర్పించాలని.. ఇందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. నేటి విద్యా విధానంలో విద్యార్థులకు వ్యాయామం లేక శారీరక, మానసిక ఎదుగుదల కనిపించడం లేదన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థలు కేవలం ర్యాంకులపైనే దృష్టి సారిస్తున్నాయని.. ఈ ధోరణి మారాలన్నారు. పిల్లలకు విద్య, వ్యాయామం, విశ్రాంతి చాలా అవసరమని పేర్కొన్నారు. ప్రతి స్కూల్‌లో క్రీడలను ప్రోత్సహించాలని సూచించారు. సమావేశంలో మండల విద్యాధికారి ప్రభాకర్, టెన్నిస్ క్రీడాకారుడు మౌలా తదితరులు పాల్గొన్నారు.

మిరపకు బింగి తెగులు



బింగి తెగులుతో ఉన్న మిరప పంట

బనగానపల్లె: సూపర్–10 మిరప పంటలో బింగి తెగులు ఆశించి రైతులను తీవ్రంగా నష్టపరుస్తోంది. నియోజకవర్గంలో మిరప పంట సాధారణ సాగు విస్తీర్ణం 3,786 హెక్టార్లు కాగా రైతులు 4,459 హెక్టార్లలో పంట వేశారు. ఇందులో బనగానపల్లె మండలంలో 1075 హెక్టార్లు, అవుకు– 810, కోవెలకుంట్ల– 928, కొలిమిగుండ్ల –396, సంజామల మండలంలో 1250 హెక్టార్లలో పంట సాగు చేశారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటను సాగు చేసినప్పటి నుంచి అధిక వర్షాలతో పంటకు కుళ్లు తెగులు ఆశించి పంట దెబ్బతింది. దీనికి తోడు కలుపు మొక్కలతో పెరుగుదల లోపించింది. రైతులు వాటిని తొలగించి క్రిమిసంహారక మందులు వాడడం వల్ల పంట ఆశాజనకంగా మారింది. అయితే మళ్లీ కొంత కాలంగా బింగి తెగులు ఆశించడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఎకరానికి 14 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా 7 నుంచి 8 క్వింటాళ్లకు మించి వచ్చే పరిస్థితి లేదని రైతులు దిగులు చెందుతున్నారు. క్వింటా రూ.14–15 వేలు మాత్రమే ఉన్నందున నష్టమే మిగులుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిలిచిన రిజిస్ట్రేషన్లు



వెలవెలబోతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

బనగానపల్లె రూరల్: బనగానపల్లె సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో శనివారం రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న శ్రీధర్‌గుప్తా గతంలో శ్రీసత్యసాయి జిల్లాలో 16.80 ఎకరాల ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేయడంతో ఉన్నతాధికారులు ఆయన్ను సస్పెండ్ చేశారు. దీంతో శనివారం ఇన్‌చార్జ్ బాధ్యతలు ఎవరికీ ఇవ్వకపోవడంతో రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన పలువురు క్రయ విక్రయదారులు విషయం తెలుసుకుని వెనుదిరిగారు. సుమారు రూ.5 లక్షల నుంచి రూ. 6 లక్షల వరకు ప్రభుత్వం ఆదాయం కోల్పోయింది.

కార్తీక దీపాలు / గుండంలో కార్తీక పూజలు



కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

గుండంలో కార్తీక పూజలు



పుట్టలో వెలసిన ఆంజనేయస్వామి

కొలిమిగుండ్ల: కోర్నపల్లె సమీపంలోని గుండం ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీక మాసం మూడో శనివారం సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. పుట్టలో కొలువైన స్వామికి ఆకుపూజ, అభిషేకంతో పాటు విశేష పూజలు నిర్వహించారు. ఆలయానికి ఎదురుగా ఉన్న కోనేరులో మహిళలు స్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వెలిగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు రద్దీగా మారాయి. బలిజ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేశారు. చెక్కభజన కళాకారుల ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

కష్టపడిన వారికి ఇచ్చే గుర్తింపు ఇదేనా?

ప్యాపిలి: పార్టీ విజయానికి కష్టపడిన వారికి ఇచ్చే గుర్తింపు ఇదేనా అని తెలుగు తమ్ముళ్లు టీడీపీ నాయకులను ప్రశ్నించారు. స్థానిక షాదీఖానాలో శనివారం టీడీపీ సభ్యత్వ నమోదుపై డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి తనయుడు కోట్ల రాఘవేంద్ర రెడ్డి సమీక్ష నిర్వహించారు. గ్రామాల వారీగా జరుగుతున్న సమీక్షలో పలు గ్రామాల కార్యకర్తలు వారి ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ఓట్లు వేయించిన వారికి ఏమాత్రం గుర్తింపు లభించడం లేదన్నారు. కొందరు టీడీపీ నాయకులు తమ సొంత గ్రామాల్లో కాదని పక్క గ్రామంలో వేలుపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తద్వారా గ్రామాల్లో చిచ్చు పెట్టేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. పరస్పరం వాదులాటతో సమీక్షా సమావేశం రసాభాసాగా మారింది. దీంతో పోలీసులు జోక్యం చేసుకోవడంతో సమస్య సద్దుమణిగింది.

మద్యం విక్రేతల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

డోన్ రూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. శనివారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. ఎక్సైజ్ పరిధిలోని పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించామన్నారు. ప్యాపిలి మండలం అలెబాద్‌తండాలో ముదువత్ శ్రీరామ్‌నాయక్ అక్రమంగా నాటుసారా అమ్ముతుండగా అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఇతని వద్ద నుంచి 100 లీటర్ల నాటు సారా, టీవీఎస్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అలాగే డోన్ మండలం మల్లెంపల్లి గ్రామంలో దాడులు నిర్వహించి బయిటోళ్ల సుంకన్నను అరెస్టు చేశామన్నారు. ఇతని వద్ద నుంచి 11 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్‌ఐలు సోమశేఖర్‌రావు, దౌలత్‌బాషా, హెడ్ కానిస్టేబుళ్లు లక్ష్మీనారాయణ, సుధాకర్‌రెడ్డి, నరసింహులు, ఉమాకాంత్‌రెడ్డి, రంగస్వామి ఉన్నారు.

మద్యం స్వాధీనం

బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లెలో నాటుసారా విక్రయిస్తున్నారనే సమాచారంతో నంద్యాల ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన రమేష్ నాయక్, మధునాయక్ వద్ద నుంచి 45 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

పుస్తక పఠనంతో విషయ పరిజ్ఞానం



బనగానపల్లెలో రిటైర్డ్ గ్రంథాలయ ఉద్యోగులకు సన్మానం



బేతంచెర్ల: గాడిచర్ల చిత్రపటానికి నివాళి

బనగానపల్లె రూరల్: పుస్తక పఠనంతో విషయ పరిజ్ఞానం పెంపొందుతుందని బనగానపల్లె గ్రంథాలయ అధికారి బషీర్‌అహమ్మద్ అన్నారు. శనివారం స్థానిక గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య తదితర ప్రముఖుల చిత్రపటాలకు నివాళులర్పించారు. రాష్ట్రంలో గ్రంథాయాల ఏర్పాటుకు కృషి చేసిన ఉద్యమకారులను తప్పనిసరిగా స్మరించుకోవాలన్నారు. గాడిచెర్ల హరిసర్వోత్తమరావు నంద్యాల మొదటి ఎమ్మెల్యేగా గెలుపొంది ఇక్కడి ప్రజలకు సేవలందించినట్లు తెలిపారు. ఆయన కాలంలోనే వయోజనవిద్య ప్రారంభించిన్నట్లు గుర్తు చేశారు. అనంతరం రిటైర్డ్ గ్రంథాలయ సిబ్బంది నరసింహారెడ్డి, రాఘవరెడ్డి, వెంకటేశ్వర్లు, మహబూబ్‌ఖాన్‌లను సన్మానించారు.

సద్వినియోగం చేసుకోవాలి

సంజామల: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని జ్ఞానాన్ని పెంచుకోవాలని ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం సురేష్ రెడ్డి అన్నారు. సంజామల ప్రభుత్వ పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం విద్యార్థులకు ఉద్యమకారుల గురించి వకృత పోటీలను నిర్వహించారు. గ్రంథాలయ అధికారి తిమ్మారెడ్డి, తెలుగు పండిత్ శ్రీనువాసులు, మద్దిలేటి పాల్గొన్నారు.

ప్రముఖులకు నివాళి

బేతంచెర్ల: సమాజంలో గ్రంథాలయాల పాత్ర కీలకం అని ఆశాఖ అధికారి మధుశేఖర్ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక లైబ్రరీలో గాడిచర్ల హరిసర్వోత్తమరావు, వెంకటరమణయ్య, రంగనాథం చిత్రపటాలకు నివాళులర్పించారు. గ్రంథాలయాల అభివృద్ధికి వారు చేసిన సేవలను కొనియాడారు.

నేడు డయల్ యువర్ డీఎం

కోవెలకుంట్ల: ప్రజా రవాణా సమస్యలపై స్థానిక ఆర్టీసీ డిపోలో ఆదివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ తిరుపతయ్య తెలిపారు. డిపో పరిధిలోని ఆయా రూట్లలో తిరిగే బస్సు సర్వీసులపై సూచనలు, సలహాలు, ఫిర్యాదులు అందజేయాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. 99592 25 798కు ఫోన్ చేసి సమస్య లు తెలియజేయాలన్నారు.